
# ధరఖర్వాటుడొకండు...

**చలపతికి పండగలంటే భయం. ఆ భయం చిన్నప్పటినుంచీ ఉన్నదికాదు.**

ఆ భయం పండగ ఖర్చులగురించిగాని, హడావుడి గురించిగానీ అసలేకాదు.

ఆ భయం ఇటీవలినుంచే ప్రారంభమైంది.

సరిగ్గా చెప్పాలంటే — ఆ భయం మొన్న సంక్రాంతినుంచే పట్టుకుందతనికి.



ఆ భయానికి కారణం అతను కొన్న కలర్ టివి. ఆ టి.వి.లో వచ్చే తెలుగు పండగ ప్రోగ్రామ్‌లు!

అసలేం జరిగిందంటే...

** ** **

చలపతి జాగ్రత్తపరుడు. చిత్రహింసలకి గురికాకుండా తప్పుకు తిరగడం అతనికి చిన్నప్పటినుంచీ అలవాటే. చాలాయేళ్ల క్రితమే టి.వి ప్రోగ్రాంలు ఆరోగ్యానికి, ఆనందానికి ప్రమాదకరమని అతను పసిగట్టేశాడు. ప్రతిరోజూ ఉద్యోగమూ, ఇతర వ్యాపకాలుండడంవల్ల ఈజీగా వాటిబారినుంచి తప్పించుకోగలడు. అయితే పండగ రోజుల్లోనే కాస్త ఇబ్బంది. తలస్నానాలూ, పూజలూ, పిండివంటలు ఆరగింపులూ, ఇత్యాది బోలెదు తతంగాలతో ఇంటిపట్టునే ఉండాల్సి వస్తుంది. అయినా వాటిని కూడా తప్పించుకోవడం ప్రాక్టీసు చేశాడు చలపతి. ప్రోగ్రాంలు మొదలవకముందే ఏదో పని కల్పించుకుని బయటపడడం ప్రాక్టీసు చేశాడు. అందుకు వీలుగా అతనికి రేడియో కేంద్రాలు ఎంతో సహకరిస్తాయి కూడానూ! ఏ పండగ వచ్చినా ఆ పండగ పాటలు ప్రసారం చేసి 'ఇవాళ పండగ్రోయ్! జాగ్రత్తపడండి! అని హెచ్చరికలు, వార్ సిగ్నల్సు జారీచేస్తాయి. అట్లతద్దయినా, వరలక్ష్మీవ్రతమైనా ఇట్టే తెలిసిపోతుంది.

"అట్లతద్దోయ్ — అట్లుపోయంగా బంగారు నీ మొగుడు నిన్ను మురిపించగా!" అనో —

"ఆరనీకుమా ఈ దీపం కార్తీకదీపం"

"సీతారాముల కళ్యాణం చూడదమురా రండీ!" అనో

"వచ్చింది దీపావళి పండగ — ఉన్నోళ్ల డబ్బంతా దండగ —

"రేపల్లెవాడలోన కిష్టమూర్తి నువ్వు రేయనక పగలనక తిరిగావ కిష్టమూర్తీ!" ఇలాంటి పాటలు వినిపించగానే చలపతి అలర్ట్ అయిపోతాడు. ఇలా ప్రమాద సూచికనెగరేసే రేడియో అంటే చలపతికి ఇష్టంకూడా.

అయితే పోయిన సంక్రాంతికి రేడియో హెచ్చరించినాసరే తలరాత సరిగా లేక దొరికిపోయాడు.

ఉదయాన్నే తలంటుకుని స్నానంచేసి బట్టలేసుకుని బైటకి బయల్దేరబోయాడు.

ఇంతలో వాళ్ళావిడ రుక్మిణి బాంబుపేల్చింది "ఏమండోయ్! అప్పుడే ఎక్కడికి బయల్దేరారు పేకాటకేనా! కాస్త ఆగండి అరిసెలు, బొబ్బట్లు తిని వెళ్దురుగాని!" అంది.

"ఇప్పుడొద్దు రుక్కూ. మళ్లీవచ్చి తింటా!" అని తప్పించుకోబోయాడు. ఊహూ ఆవిడ వినలేదు. విధి వక్రించినప్పుడు ఫాలాక్షుడైనా తప్పించుకోలేడుగదా!

"సరే — త్వరగా పట్టా!" అని కుర్చీలో కూలబడ్డాడు.

"ఇదుగో అయిదు నిముషాలు. ఈలోగా టి.విలో ప్రత్యేక కార్యక్రమంవుంది చూడండి. పక్కింటి పిన్నిగారు, వాళ్లకోడలూ అందరూ వచ్చారు. వాళ్లు ఆ గదిలో కూర్చుంటారులెండి. వాళ్లూ ప్రోగ్రాం చూస్తారుట" అని మరో 'స్కడ్' వదిలింది రుక్మిణి. అంటే టి.వి కట్టెయ్యడానికి వీల్లేదు. చూడకుండా వెళ్ళడంగాని, కళ్లు మూసుకోవడంగాని కుదరదు. వాళ్లు చూస్తారు బావుండదు.

విధిలేక టి.వి ఆన్‌చేశాడు చలపతి.

అనౌన్సర్ ప్రత్యక్షమైంది విరగబడి నవ్వుతున్నట్లు నోరంతా తెరిచి "నమస్కారం! వేడు సంక్రాంతి. మనకందరికీ పండగ. అదే సంక్రాంతి (ఈ సంగతి రాష్ట్రానికంతా తెలును గా! ముప్పయ్‌సార్లు చెప్పడమెందుకూ?) నమస్కారం!" అందావిడ.

ఇన్ని నమస్కారాలు రోజూ ఎవరూ పెట్టరుగనక కాస్త సంతోషపడి "నమస్కారం" అని గొణుక్కున్నాడు చలపతి.

"మన మధురమైన సంక్రాంతి ప్రత్యేక కార్యక్రమాన్ని జంబులింగంగారు నిర్వహిస్తారు – నమస్కారం!" అంది అనౌన్సర్ మళ్లీ.

ఇంతలో ఓ లావుపాటి శాల్తీ ప్రత్యక్షమైంది బుల్లితెరమీద.

"నమస్కారం ఈరోజు పర్వదినం. అంటే సంక్రాంతి అన్నమాట. సంక్రాంతి అంటే మనకు – అంటే ఆంధ్రులకు ముఖ్యమైన పండగ అన్నమాట! అసలు సంక్రాంతి అంటే ఏమిటి! మనం ఈ పండగ ఎలా జరుపుకోవాలి?

ఇవన్నీ చెప్పడానికి ప్రముఖులు వచ్చారు. వారు అన్నీ వివరంగా చెబుతారు. మరి విందామా?" మళ్లీ నవ్వాడు సదరు జంబులింగంగారు. (వినక తప్పుతుందా?)

"ఇప్పుడు సంక్రాంతిగురించి శ్రీమతి కిసలయదేవిగారు (అదేం పేరో!) నవభూషణరావు గారూ చెబుతారు. "ఏమండీ ఇవాళ సంక్రాంతిగదా!" అన్నాడు జంబులింగం వాళ్ళిద్దర్నీ చూస్తూ –

"అవునండీ మనందరి సంక్రాంతి!" అన్నారిద్దరూ అదేదో యూనివర్సల్ ట్రూత్ కని పెట్టినట్టు.

"ఆ! కిసలయదేవిగారూ! సంక్రాంతి గురించి మీరు చెప్పండి!" అన్నాడు జంబులింగం కిసలయదేవితో. ఆవిడను తెరనిండుగా చూపించారు. లావుగా, పొట్టిగా ఉన్నావిడ ఒంటిమీద చిత్రమైన నగలన్నీ ప్రదర్శిస్తూ ముసిముసి నవ్వులు నవ్వింది.

"చెప్పడానికేముందండీ? (ఆ సంగతి మాకు తెలును) అయినా ఇది మామూలు పండగగాదు. సంక్రాంతి. ఆనందప్లావిత హృదయానంద క్రాంతి. ఆహ్లాదభరిత శారదాత్మక సుషమ పరిమళ విరళ త రళ విక్రాంతి. ఆంధ్రుల అవిరళ సరళ సంచలన సరస సమ్మేళన వికల్ప శాంతి. సంక్రాంతి!" అందావిడ డీప్‌గా కెమేరావైపు చూస్తూ.

ఆవిడే భాష మాట్లాడుతున్నారో అర్థంగా లేదు చలపతికి. అతనికి సన్నగా తలనొప్పి ప్రారంభమైంద.

"మీరేమంటారు నవభూషణరావుగారూ!" అన్నాడు జంబులింగం మరో వ్యక్తివైపు తిరిగి పళ్లికిలిస్తూ –

సన్నగా రివటలావున్న 'నవ'గారు ఓ రగ్గులాటి శాలువా కప్పుకుని శూన్యంలోకి చూస్తూ ఓ దగ్గు దగ్గి –


"నేనేమంటాను? ఏమనగలను? స్వాతంత్ర్యం పూర్వంనుంచీ ఈ సంక్రాంతి వస్తోంది. అప్పుడు ఆంగ్లేయుల పాలనలో ఇది బానిస సంక్రాంతి. ఇప్పుడు స్వతంత్ర భారత సంక్రాంతి. మనం గర్వించదగ్గ సంక్రాంతి" అన్నాడు.

"చక్కగా చెప్పారు! ఆ కిసలయదేవిగారూ సంక్రాంతికేం చేయాలండీ?" జంబులింగం అడిగాడు.

"మంచి ప్రశ్నవేశారు. మరేమోనండీ సంక్రాంతికి ఉదయాన్నే కల్లాపిచల్లి ముగ్గులేసుకుని, పిండివంటలు చేసుకు తిని, కొత్తబట్టలు వేసుకుని ఆనందంగా ఉండాలండీ. సర్దాగా స్నేహితుల్తో గడపవచ్చు. సినిమాలకికూడా వెళ్ళవచ్చు. సినిమా చూడకపోతే షికారు కెళ్ళొచ్చు" అందావిడ.

"బాగా చెప్పారండీ. మీరేమంటారు నవభూషణరావుగారూ!"

"అవునండీ. అలాగడపొచ్చు. అయినా మనం అలా సినిమాలకీ, షికార్లకీ వెళ్లేబదులు మనదేశం గురించి, సంస్కృతి గురించి, ప్రగతి గురించి ఆలోచిస్తూ గడపాలండీ. మన మహనీయుల చరిత్రకూడా చదువుకోవచ్చు ఇంచక్కా! సంక్రాంతిరోజు మనం దేశసేవకు అంకితం కావాలని ప్రతిన బూనాలి!" అన్నాడు న.భూ.రావు అర్థనిమీలిత నేత్రాలతో కెమేరావైపు చూస్తూ



రాజశేఖర పాండే

"థాంక్సండీ! ఎన్నో విషయాలు చెప్పా

ఇప్పుడు కిసలయదేవిగారు చెప్పారుగదా! కళ్లాపి అని — ఆ కళ్లాపి ఎలా చల్లాలో చెప్పడానికి బుచ్చాయమ్మగారు వచ్చారు. మరి విందామా!" అన్నాడు జంబులింగం.

చలపతి కడుపులో తిప్పుతోంది "రుక్మా! త్వరగా కాఫీ ఇవ్వు పమంది వెళ్ళాలి!" అని గావు కేక పెట్టాడు.

"ముందు ఇవి తినండి!" అని అరిసెలు, బొబ్బట్లూ తెచ్చింది రుక్మిణి. అవి నోట్లో గబగబా కుక్కుకోవడం ప్రారంభించాడు చలపతి.

ఇంతలో తెరమీద ఇంకో లావుపాటి ఆవిడ ప్రత్యక్షమైంది.

"నమస్కారం బుచ్చాయమ్మగారూ! కళ్లాపిగురించి మా శ్రోతలకి విపులంగా చెబుతారా?"

జంబులింగం బతిమాలినట్టు అడిగాడు.

ఆవిడ వాంతి చేసుకుంటున్న ఫీలింగ్ ముఖంలో చూపిస్తూ నవ్వింది.

"తప్పకుండానండీ! అసలు కళ్లాపి మన సంస్కృతికి చిహ్నం. అయితే చాలామంది తమ ఇష్టం వచ్చినట్లు చల్లేస్తుంటారు. అది చాలా తప్పు. కళ్లాపిని శాస్త్రీయంగా చల్లాలి. ముందు మనం ఏమేరకు ఎక్కడ కళ్లాపి చల్లాలో నిర్ణయించుకోవాలి. ఆ ఏరియాని ఉదాహరణకి కళ్లాపి చల్లడానికి 'పెరడు' ఎన్నుకున్నామనుకోండి ఆ ఏరియా కొలతలు తీసుకోవాలి. కొలతలు తీసుకొనేటప్పుడు పెరడు వైశాల్యమేగాక దాని ప్లింత్ ఏరియాకూడా పరిగణనలోకి తీసుకోవాలి... మరేమోని..."

"రుక్మా —" అరిచాడు చలపతి. అతనికి వికారంగా కడుపులో తిప్పుతున్నట్లుంది. "రుక్మా! నాకు కాఫీ పట్రా!"

"అయ్యో! ఆ బొబ్బట్లు తినండి!" అంది రుక్మిణి.

"తినను ఛస్తే తిననుగాక తినను. కాఫీ ఇస్తావా? ఇవ్వవా?"

## ఇదో వివాద సినిమా

* మండల్ కమిషన్ మళ్ళీ భూతమై మన ముందుకొస్తోంది. ఎన్నికల్లో 'మండల్ — కమండల్' ప్రసక్తి చాలా ఉంటుందని పలువురి అభిప్రాయం. అదెలా ఉన్నా మండల్ కమిషన్ గొడవల సమయంలో మొదలైన ఓ సినిమా కూడా ఇప్పుడు విడుదలకు సిద్దమవుతోంది. సినిమా పేరు 'శూద్ర్'. దీని నిర్మాత రవీంద్ర సోనీ. దర్శకుడు విక్కీరాణా(పూర్తి పేరు విక్రమ్‌సింగ్ రాణావత్). విజయారెడ్డి, ఎస్.ఎ. చంద్రశేఖర్, కె.బాపయ్యల దగ్గర ఈ రాణావారు అసిస్టెంట్‌గా చేశాడు!

"అయ్యో! అవేం మాటలండీ ఇప్పుడే కాఫీ తెస్తున్నా!' అని వంటగదిలోకి పరుగెత్తిందామె.

బుచ్చాయమ్మ డిమాన్‌స్ట్రేషన్ మొదలైంది.

"కళ్లాపి చల్లడానికి కావలసిన వస్తువులు — శుభ్రమైన పేడ, గేదె పేడయినా, ఆవు పేడయినా ఫర్వాలేదు. నీళ్ళు, బకెట్టు, ఓ గుండు చెంబు, ఇవికూడా ముందే సిద్ధం చేసుకోవాలి. పేడను పొద్దుటే గేదెలవెంట ఎవర్నైనా పంపి సేకరించాలి. తర్వాత పుల్లాపుడకా లేకుండా పేడని శుభ్రంచేసి రెండు చేతుల్తో శుభ్రంగా పిసకాలి. నాలుగు లీటర్ల నీళ్ళల్లో రెండుంబావు కిలోల పేడవేసి ఇదుగో ఇలా బాగా కలియబెట్టాలి. (తెరమీద బుచ్చాయమ్మ పేడ కలిపే సీను క్లోజప్పులో) తర్వాత బాగా వేడినీళ్లు తోడినట్లు తోడాలి. తర్వాత..."

కాఫీ రావడంలేదు. చలపతికి తల తిరుగుతోంది. డోకొచ్చేలా ఉంది. కళ్ళుమూసుకున్నా బుచ్చాయమ్మ బొంగురు గొంతు వినబడుతోంది.

"పెరడుకు ఓ మూలగా ఆగ్నేయ మూల అయితే మంచిది. బకెట్ పెట్టి ఎడమచేత్తో గుండు చెంబు పట్టుకుని దానిలో పావులీటరు పేడ కలిపిన నీళ్లు దీనినే కళ్లాపి అంటామండీ. కళ్లాపి తీసుకుని కుడిచేతికవేళ్లు ఎడంగా పెట్టి నీళ్లను స్ప్రే చేసినట్లు చల్లాలి. ఇందులో ముఖ్యంగా గమనించాల్సిందేమిటంటే కళ్లాపి చల్లేటప్పుడు సోదరీమణులు చీరకొంగు నడుముకు దోపుకోరు. ఈ అలవాటు మంచిదికాదండీ. దీనివల్ల కళ్ళాపి తుంపర్లు చీరచెంగుమీద పడే అవకాశం ఉంది. అందుకే చీరచెంగుల్ని నడుముకు దోపుకోవాలి! అప్పుడేమోని..."

ఇంతలో హఠాత్తుగా కరెంట్ పోయింది. రుక్మిణి కాఫీ తెచ్చింది.

"అబ్బ కాఫీకేం తొందరొచ్చిందోయ్ రెండు బొబ్బట్లు తిననియ్యి" అన్నాడు చలపతి పట్టరాని ఆనందంతో. అతనికి కరెంటు వాళ్ళ మీద ఎనలేని ప్రేమ పుట్టుకొచ్చింది.

"అయ్యో! అదేమిటండీ — ఇప్పుడేగా కాఫీ — కాఫీ అని గగ్గోలు పెట్టారు" అంది రుక్మిణి మొగుణ్ణి వింతగా చూస్తూ.

చలపతి ఆనందం ఎంతోసేపు నిలవలేదు.

మళ్ళీ కరెంట్ వచ్చేసింది. హు — పరీక్షల సీజన్లోనో, మందువేసవిలోనో కరెంట్ పోతే చచ్చినారాదు. మనం చిత్రవధకు గురయ్యేటప్పుడుమాత్రం తపీమని కరెంటొస్తుంది. చలపతికి ఇందాక కరెంటువాళ్ల మీద కలిగిన ప్రేమ ఆవిరైపోయి పట్టరానికోపం వచ్చింది. మళ్లీ అనౌన్సర్ ముఖం తెరమీద — "మా బాగా అయిందిలే మీ పని" అన్నట్లు వికారంగా నవ్వుతూ "నమస్కారం!" అంది.


చలపతి చేతిలో బొబ్బట్టు జారిపోయింది. గబుక్కున కాఫీ అందుకున్నాడు.

"అదేమిటి ఇప్పుడేగా బొబ్బట్లు తింటానన్నారు? అప్పుడే ఏమైంది? అసలు మీకేమైందీ వేళ?" అంది రుక్మిణి భర్తను అనుమానంగా చూస్తూ.

"ఇంకా పిచ్చెక్కలేదు. నువ్వు కాసేపు నోర్ముయ్" అని కాఫీ గబగబా తాగడం ప్రారంభించాడు చలపతి.

"ఇప్పటిదాకా మీరు సంక్రాంతి గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నారు! ఇహ ముగ్గులు వేయడం ఎలా? అఖిల భారత ముగ్గుల పోటీలో గెలుపొందిన రథం రాధాబాయిగారు చెబుతారు" మార్చిన పట్టుచీరను సవరించుకుంటూ చెప్పింది అనౌన్సర్. తెరమీద మరో ఆవిడ ప్రత్యక్షమైంది ముఖం చిట్లించుకుని —

"నమస్కారం— ముగ్గులు వెయ్యగానే మురిపెంగాదు — ముగ్గులు అందానికేకాదు పాటివారికి తోడ్పడాలి. సామాజిక స్పృహ మన



ముగ్గుల్లో కన్పించాలి. మన ఇంటి ముంగిట ముగ్గుల్తో ఈ సమాజానికి సేవచేయాలి. "రాధాబాయమ్మ ఆవేశపడిపోతోంది. ఉరిమి చూస్తోంది కెమేరావైపు. వస్తున్న దోకును బలవంతంగా ఆపుకుని మిగిలిన కాఫీ నోట్లో వంపుకున్నాడు చలపతి.

"మన స్త్రీలు సంక్రాంతికి ఏ రథం ముగ్గులో వేయకుండా అ—ఆ—ఇ—ఈ గావి పలక—గిలక— అల—వల—తల లాటివి రాయాలి. అప్పుడు ఆ దారంట వెళ్లే శ్రామికులు, రైతులు, నిరక్షరాస్యులు ఇంచక్కా చదువు నేర్చుకుంటారు. అంటే మన ముగ్గులు ఒకవిధంగా వయోజనవిద్యకు ఉపయోగపడతాయన్నమాట. అలాగే హిందూదేశ పటంవేసి రంగురంగుల్లో మన ప్రాజెక్టులు, పరిశ్రమలు, నదులు వెయ్యొచ్చు. మన ఇంటి ఆవరణలోనే గాకుండా పక్క ఇళ్ళకుకూడా మన ముగ్గులు పాకేటట్లు చేయాలి. దానివల్ల సహోదరత్వం పెరిగి దేశ సమగ్రత సాధించగలం. మన పెరట్లో ముగ్గులను ఇతర పెరట్లోముగ్గులతో కలిపి 'మానవహారం'లాగా ముగ్గుల హారం సృష్టించి జాతీయ ఐక్యత చాటొచ్చు. ఇంకా.."

ఇహ వినలేక అక్కణ్ణించి పరుగెత్తాడు చలపతి.

** ** **

చలపతి ఓ గంట రోడ్లమీద తిరిగి కాస్త తిక్క తగ్గినట్లన్పించగానే రంగారావు ఇంటికి వెళ్ళాడు. రంగారావ్ చలపతి స్నేహితులు. చలపతిని చూడగానే "రావోయ్! రా!" అని ఆహ్వానించి ఇంట్లోకి తీసుకెళ్ళాడు.


గదిలోపలికి వెళ్ళగానే చలపతి కళ్లు బైర్లుకమ్మాయి. గది మధ్య టి.వి. టి.వి చుట్టూ జనం. ఏదో గొబ్బెమ్మల పాట వస్తోంది.

"కాసేపు టి.వి చూడవోయ్!" అన్నాడు రంగారావు చలపతి వెళ్తానన్నా విన్పించుకోకుండా.

గొబ్బెమ్మల చుట్టూ ఆడవాళ్లు తిరుగుతూ మ్యూజిక్‌కు అనుగుణంగా పాడుతున్నారు.

"గొబ్బియల్లో గొబ్బియల్లో దేశప్రగతికివి అందియల్లో మనదేశం మహాదేశం — లేవు కలతలూ — గొబ్బియల్లోఅన్నిమతాలొకటే గొబ్బియల్లో — పొదుపు చెయ్యి గొబ్బియల్లో — భరతమాతగొబ్బియల్లో — ఆహో...ఓహో — లలలలా..." ఇలా సాగుతోంది పాట.

"ఇదేం గొబ్బియలపాట?" అన్నాడు చలపతి కంగారుగా.




"ఇది రామానగరం గొబ్బియల ట్రూపు. మామూలు గొబ్బెమ్మల పాటలకు టి.విలో ఛాన్సుండదు. దేశభక్తి — గవర్నమెంట్ పాలసీలమీద పాట ఉండాలి! ప్రతి ఏడాదీ ఈ ట్రూపుకే కాంటాక్ట్ ఇస్తారు!" అన్నాడు రంగారావు.

కెమేరా కాసేపు మహిళల మీదా, కాసేపు పేడమీదా పాస్ అవుతోంది! ఆడవాళ్లంతా గొబ్బెమ్మలవైపు కాకుండా కెమేరావైపు చూస్తూ — కిలకిల నవ్వుతూ పాడుతున్నారు.

ఇంతలో సడన్‌గా పాట ఆగాయమై అనౌన్సర్ ప్రత్యక్షమైంది. ఇందాకటిఅనౌన్సరే — కాకపోతే మళ్లీ చీరమార్చి — నెక్లెస్ కాకుండా పూసలదండ వేసుకుంది.

"నమస్కారం — ఇంతవరకూ గొబ్బెమ్మల పాట విన్నారు. ఇక ఇప్పుడు సంక్రాంతి రోజు మనం మన గేదెల్ని ఎలా శుభ్రంగా కడుక్కోవాలో గేదెల గున్నయ్యగారు వివరిస్తారు" అనగానే ఓ బుర్రమీసాలాయన చుట్టూ గేదెల మధ్య ప్రత్యక్షమయ్యాడు.

"గేదెలు స్నానం చెయ్యవు. వాటిని పండగనాడు మనమే శుభ్రం చెయ్యాలి. గేదెల్ని కాలవకుగాని, లేక మన గొడ్లసావిట్లోగాని శుభ్రం చెయ్యాలి. ముందుగా పిడికెడు ఎండుగడ్డిని తీసుకుని ఆ గడ్డిని నీళ్లలో ముంచి..."

ఇహ కంట్రోల్ చేసుకోవడం చలపతివల్ల కాలేదు. కళ్లు తిరిగి దబ్బున కిందపడిపోయాడు!

** ** **

కళ్లు తెరిచేటప్పటికి ఆస్పత్రిలోవున్నాడు చలపతి. చుట్టూ స్నేహితులు ఆదుర్దాగా నిలబడి ఉన్నారు.

"ఏంలేదు కాస్త ఇష్టంలేనిదేదో చూసి షాక్ తిన్నాడని డాక్టర్ చెప్పారు. కంగారుపడుతుందని మీ ఆవిడకి చెప్పలేదు" చెప్పాడు రంగారావు.

"అయామ్ ఆల్ రైట్! ఇంటికి వెళ్ళిపోతాను!" అన్నాడు చలపతి.

"అలాగే — ఉండు డాక్టర్‌ని అడిగి వస్తా!" అని ఆ రూమ్‌లోనుంచి బయటికెళ్ళాడు రంగారావు.


చలపతికి నీరసంగా ఉంది. ఇంట్లో టి.విని ఎలా అమ్మాలా అని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో నర్స్ వచ్చింది గదిలోకి — "మీరు కాస్సేపటిలో ఇంటికి వెళ్ళిపోవచ్చు. హాయిగా రిలాక్స్ అవండి" అని నవ్వుతూ పలకరించి వెళ్ళింది.

మెల్లగా తలతిప్పి గదంతా కలయజూశాడు చలపతి. అంతే! అప్పటికర్థమైంది తను రిలాక్స్ అవాలనే ఉద్దేశంతో నర్సుచేసిన పని

ఎదురుగా కలర్ టి.వి ఆన్‌చేసి ఉంది. అనౌన్సర్ తెగ నవ్వుతూ నమస్కారం చేసింది మళ్ళీ. "ఇప్పుడు మీరు సంక్రాంతి సినిమా పాటలతో సమకూర్చిన కార్యక్రమం వింటారు" అనగానే పాత సంక్రాంతి పాట మొదలైంది — అంతే! —

కెవ్వున అరిచి మళ్ళీ స్పృహ తప్పిపోయాడు చలపతి.




పటిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్